

నేడు నంజనగూడు బంద్

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లాలోని నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయంలో చోటుచేసుకున్న వివాదం ఇంకా రాజుకుంటూనే ఉంది. ఆలయ భక్తులు, నంజనగూడు వాసులు గురువారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. అంధకాసుర సంహార ఆచరణను దళిత సంఘర్ష సమితి వ్యతిరేకించింది. తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని అడ్డుకోరాదని భక్తులు పట్టుబట్టారు. గత వారం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆందోళనలో పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోలేని పోలీసులు శాంతియుతంగా ఆందోళన చేసే భక్తులను కట్టడి చేస్తున్నారని మండిపడుతున్నారు.



మతం ముసుగులో క్రిమినల్‌ను కాపాడే యత్నం!

- శ్రీరామచంద్రుడూ క్షమించడు
- శ్రీకాంత్ పూజారి 16 కేసుల్లో నిందితుడు
- బీజేపీ తీరుపై సీఎం ఆగ్రహం

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మతం ముసుగులో క్రిమినల్‌ను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ఈ చర్యను శ్రీరామచంద్రుడు కూడా క్షమించబోడని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడుతున్న శ్రీకాంత్ పూజారి అనే వ్యక్తి వీటి నుంచి రక్షణ పొందేందుకే మతాన్ని కవచంగా వాడుకుంటున్నారని పేర్కొన్నారు. అక్రమంగా సారాయి విక్రయం, దోపిడీ, మట్కా, జూదం వంటి 16 కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నాడన్నారు. ఇలాంటి క్రిమినల్స్‌ను బీజేపీ వెనకేసుకు రావడం విచారకరమన్నారు. ఇలాంటి నేరాలు చేసేవారికి పరోక్షంగా బీజేపీ తన చర్యల ద్వారా మద్దతునిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. హుబ్బళ్లి-ధారవాడ పోలీసులు వివిధ కేసులకు సంబంధించి మొత్తం 36 మందిని అరెస్టు చేశారని, వీరిలో శ్రీకాంత్ కూడా ఒకడన్నారు. కరసేవకుడు, రామభక్తుడు అనే రక్షణ కవచం ధరింపజేసి అతడిని కాపాడేందుకు బీజేపీ ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. వివిధ నేరాలకు పాల్పడి అరెస్టయిన 36 మంది జాబితాను కూడా సీఎం తన ప్రకటనతో పాటు మీడియాకు విడుదల చేశారు. రామమందిరం ప్రారంభోత్సవ సమయంలో ఒకప్పటి కరసేవ కుడైన శ్రీకాంత్ అరెస్టు కేవలం కాకతాళీయమేనని, ఇది కక్షసాధింపు కాదని, బుజ్జగింపు అంతకంటే కాదని సీఎం తన ప్రకటనలో స్పష్టంచేశారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఈ అంశంపై రాద్ధాంతం చేస్తోందన్నారు. మతం ముసుగులో ఎవరు నేరాలకు పాల్పడినా సహించేది లేదని సీఎం హెచ్చరించారు. హిందూమతం పేరు చెప్పుకుని నేరాలకు పాల్పడవచ్చునా అని ఆయన బీజేపీ నేతలను నిలదీశారు.

డీజీపీకి కాంగ్రెస్ ఫిర్యాదు

క్రిమినల్‌ను చట్టప్రకారం అరెస్టు చేస్తే కరసేవకుల్ని అరెస్టు చేస్తున్నారు.. హిందూ మతంపై దాడి చేస్తున్నారంటూ బీజేపీ దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో వదంతులు వ్యాపింప చేస్తోందని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ నాయత్వంలో నేతల బృందం బుధవారం డీజీపీ అలోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. తప్పుడు ప్రచారం చేస్తూ సమాజంలో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరింది.



డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

24 గంటల్లో విడుదల చేయాలి : బీజేపీ



ఫ్రీడంపార్కులో బీజేపీ నేతల ధర్నా

కరసేవకుడు శ్రీకాంత్ పూజారిని 24 గంటల్లోగా విడుదల చేయకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని బీజేపీ హెచ్చరించింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర సారథ్యంలో పార్టీ నేతలు బెంగళూరు ఫ్రీడం పార్కులో బుధవారం ధర్నా నిర్వహించారు. శ్రీకాంత్ విడుదల కోరుతూ ఈ నెల 9న హుబ్బళ్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించాలని బీజేపీ నిర్ణయించింది. విజయేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో తాలిబాన్ పాలన ఉందా.. ఇదేమైనా మొఘలుల రాజ్యమా? పోలీసు రాజ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ వ్యతిరేక విధానాలు ఇలాగే కొనసాగిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని, గత ఎన్నికల్లో గెలిచిన ఆ ఒక్క నియోజకవర్గం కూడా దక్కదని హెచ్చరించారు. బీజేపీ ప్రముఖ నేతలంతా ధర్నాలో పాల్గొన్నారు. బీజేపీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

సదానందగౌడ యూటర్న్!

- స్వరం మార్చిన బీజేపీ నేత



బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రాజకీయాలకు ఇటీవల గుడ్‌బై చెప్పేసిన బెంగళూరు నార్త్ బీజేపీ ఎంపీ డీవీ సదానందగౌడ తాజాగా యూ టర్న్ తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్‌తో భేటీ అనంతరం ఆయన స్వరం మార్చారు. మళ్లీ తననే పోటీచేయాల్సిందిగా బీజేపీ సీనియర్లతో పాటు నియోజకవర్గం కార్యకర్తలు, ప్రజలు ఒత్తిడి తెస్తున్నారని, ఈ విషయంలో అధిష్ఠానం నిర్ణయమే అంతిమని సదానందగౌడ బుధవారం మీడియాకు చెప్పారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతోనే ఇటీవల గుడ్‌బై నిర్ణయాన్ని ప్రకటించానని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ నేతలు ఎవర్నీ దూరంగా ఉంచలేదని అన్నారు. ఇలాంటి దిగుజారుడు రాజకీయాలు చేయడం తనకు తెలియదన్నారు. బెంగళూరు నార్త్ నుంచి మాజీ మంత్రి వి. సోమణ్ణ బరిలోకి దిగే అవకాశాలున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా సోమణ్ణతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి సీఎన్ అశ్వత్థనారాయణ కూడా అభ్యర్థిగా తన పేరునే ప్రస్తావించారని తెలిపారు. బెంగళూరు నార్త్ టికెట్ విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తనకు సమ్మతమేనని అన్నారు. బెంగళూరు నగర పరిధిలోని మొత్తం మూడు స్థానాలను ఈసారి కూడా బీజేపీ భారీ మెజార్టీతో కైవసం చేసుకోవడం ఖాయమని సదానందగౌడ పేర్కొన్నారు.

అటవీ భూమి రక్షణకు చర్యలు

- ఒకేరోజు రూ.60 కోట్ల విలువైన కబ్జాభూమి స్వాధీనం

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలో అత్యంత విలువైన అటవీ భూమిని కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా కెంగేరి సమీపంలోని తురహళ్లి రిజర్వు అటవీ ప్రాంతంలో బఫర్ జోన్‌లో రూ.60కోట్లకు పైగా విలువ చేసే 6.5 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ అధికారులు, పోలీసు సహకారంతో ఎక్స్‌కావేటర్లను రప్పించి ఈ ప్రాంతంలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేశారు. తెల్లవారుజాము నుంచే బీఎం కావల్ అనే ప్రాంతంలో జరిగిన కార్యాచరణను నగర అటవీశాఖ అధికారులు రవీంద్రకుమార్, సురేశ్ పర్యవేక్షించారు. కబ్జా ఉద్దేశ్యంతోనే నిర్మించిన షెడ్లను కూల్చివేశారు. వెదురు సహా అనేక చెట్లను ఇక్కడ నాటారన్నారు. ఆరున్నర ఎకరాల భూమిని మధుసూదనానందస్వామి అనే వ్యక్తి కబ్జా చేసి పర్యావరణ సంరక్షణకోసం తనకు కేటాయించాలంటూ అటవీశాఖకు దరఖాస్తు చేసుకున్నాడని అధికారులు తెలిపారు. 2017లోనే ఈ అటవీభూముల కబ్జాలను తొలగించాలంటూ ఏసీఎఫ్ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అయితే దీన్ని సవాల్ చేస్తూ పిటీషన్ దాఖలు చేయడంతో చాలాకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ఎట్టకేలకు అటవీశాఖకు అనుకూలంగా తీర్పు రావడంతో గత ఏడాది డిసెంబరు 29న అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి లింగరాజు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని, ఇందులో కబ్జాకు గురైన ఆరున్నర ఎకరాల భూమి అటవీశాఖకు చెందుంతుందని స్పష్టం చేశారన్నారు. కాగా అడవులను ఆక్రమించి పర్యావరణానికి హాని తలపెట్టేవారిపై కార్యాచరణ కొనసాగుతుందని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె బుధవారం ప్రకటించారు. కబ్జాకు గురైన అటవీభూములన్నింటినీ స్వాధీనం చేసుకుని సంరక్షిస్తామని తెలిపారు.

ఆలయాలకు కొత్త 'శక్తి'

- గణనీయంగా పెరిగిన ఆదాయం
- దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న శక్తి గ్యారెంటీ పథకం ఇటు దేవదాయ శాఖ, అటు పర్యాటక శాఖల ఆదాయాన్ని గణనీయంగా పెంచుతూ కొత్త కళను తెచ్చిందని రవాణా, దేవదాయ శాఖల మంత్రి ఆర్. రామలింగారెడ్డి పేర్కొన్నారు. బెంగళూరులో బుధవారం జరిగిన రాష్ట్ర ధార్మిక పరిషత్ రెండో సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పురాతన ఆలయాల జీర్ణోద్ధారణ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ హయాంలో సైతం ఆలయాల్లో ఇంతగా శోభాభరిత వాతారణం లేదన్నారు. దేవదాయ శాఖలో కొత్త ఉత్తేజం నింపామని, అర్చకుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ధార్మిక పరిషత్ సభ్యుడు డాక్టర్ ఎ. రాధాకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రామలింగారెడ్డిని సన్మానిస్తున్న ధార్మిక పరిషత్ సభ్యులు


సీనియర్ సిటిజన్లకు రక్షణ కల్పించండి

- గవర్నర్‌కు వినతి

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు రక్షణ కల్పించాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్ల ఐక్య కూటమి పదాధికారులు గవర్నర్‌ను కోరారు. బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు. బెంగళూరులో సీనియర్ సిటిజన్లపై దాడులు పెరిగాయని తెలిపారు. నేషనల్ క్రైం రేట్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికల ప్రకారం బెంగళూరులో 2022లో 468 కేసులు నమోదైన అంశాన్ని గుర్తు చేశారు. వాస్తవానికి వీటికంటే రెండుమూడింతలు ఎక్కువగానే దాడులు జరిగి ఉంటాయని, పోలీస్ స్టేషన్లకు అందరూ వెళ్లరని తెలిపారు. బెంగళూరు నగరం అన్ని వర్గాలకు సురక్షితమనే అభిప్రాయం ఉన్నా వృద్ధులకు తగిన రక్షణ లేదని ఎన్‌సీఆర్‌బీ నివేదికలు నిర్ధారణ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులకు తగిన రక్షణ కల్పించేలా ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సీనియర్ సిటిజన్ల ఫోరం అధ్యక్షుడు నాగభూషణ, పదాధికారులు చిక్కహొన్నయ్య, నాగరాజరావ్, ఏపీ కుమార్, ముత్తురాజు ఉన్నారు. అనంతరం దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దేశ్వర్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు.



గవర్నర్‌కు పూలకుండీ అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు




260 మందికి కొవిడ్ పాజిటివ్


బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ పాజిటివ్ కేసు లు పెరుగుతున్నాయి. బుధవారం 260 మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. 228 మంది కోలుకోగా ఒకరు మృతి చెందారు. 1175 మంది చికిత్సలు పొందుతుండగా హోం ఐసొలేషన్‌లో 1107 మంది, ఆసుపత్రిలో 68 మంది ఉన్నారు. బెంగళూరులో 134 మంది, మైసూరులో 24, బెంగళూరు గ్రామీణ 20 మంది, శివమొగ్గలో 11 మందికి వైరస్ ప్రబలగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ పదిలోపు కేసులు నమోదయ్యాయి.

రాయచూరులో డాక్టర్ సహా నలుగురికి..

రాయచూరు : గడిచిన రెండు వారాలుగా రాష్ట్ర వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో జిల్లాలోనూ నలుగురికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు బుధవారం అధికారులు ప్రకటించారు. రాయచూరు నగరంలోని ఒక వైద్యుడితో పాటు మాన్వి తాలూకా బ్యాగవాట్, మాడగిరి, మాన్వి పట్టణంలో ఒక్కొక్కరికి పాజిటివ్ ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయింది. ఈ నలుగురికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 582 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా దగ్గు, జ్వరం, జలుబు ఉన్న వారిని ప్రత్యేకంగా పరీక్షిస్తున్నట్లు వైద్యులు చెప్పారు. కొవిడ్ పాజిటివ్ కేసులు నిర్ధారణ అయిన పక్షంలో రిమ్స్ ఆస్పత్రిలో ఆక్సిజన్ సౌకర్యంతో కూడిన 20 పడకల ఐసీయూ కేంద్రాన్ని సిద్ధం చేసి ఉంచినట్లు వైద్యులు తెలిపారు. దీంతో పాటు ప్రతి తాలూకా కేంద్రంలో ఆక్సిజన్ సౌకర్యంతో కూడిన 10 ఐసీయూ పడకలను అందుబాటులో ఉంచామన్నారు. కాగా ప్రస్తుతం వస్తున్న వేరియంట్ వల్ల ఎలాంటి ప్రాణపాయం లేకపోయినా ప్రజలు తగిన జాగ్రతలు పాటించాలని అధికారులు చెబుతున్నారు.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.06	1,624.15
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,648
సామర్థ్యం (టీఎంసీలు)	10.26	73.75


శ్రీరాములు వ్యూహం ఫలించేనా?

● ఏపీ సీఎం జగన్‌రెడ్డిని కలిసిన కర్ణాటక బీజేపీ మాజీ ఎంపీలు శ్రీరాములు, సన్న ఫక్కీరప్ప ● రాష్ట్ర పార్టీలో జోరుగా చర్చలు

బళ్లారి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బీజేపీలో కీలక నాయకుడుగా వ్యవహరిస్తున్న శ్రీరాములు హఠాత్తుగా కర్ణాటక రాజకీయాలు వదిలి ఏపీ రాజకీయాల్లోకి వెళ్లడంపై కమలం పార్టీలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయన సోదరి అయిన జే. శాంతకు ఏపీలోని హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ టికెట్ ఖరారయిన విషయం తెలిసిందే. ఆమె టికెట్ ఖరారు వెనుక జే. శ్రీరాములు కీలకంగా వ్యవహరించారని తెలుస్తోంది. ముందు నుంచే ఏపీ రాజకీయాల్లో తన కుటుంబాన్ని దింపాలని ఆయన పావులు కదిపినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఆయన ఇటీవల అమరావతిలో ఏపీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని కలిసిన ఫోటోలు సోషియల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కర్ణాటక బీజేపీలో ఇంత కాలం చక్రం తిప్పిన శ్రీరాములు ఏపీ వైపు ఎందుకు అడుగులు వేస్తున్నారనేది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

కర్ణాటకలో బీజేపీ 2008లో అధికారంలోకి వచ్చింది. కర్ణాటకలో బీజేపీ అధికారంలోకి రావడానికి అప్పుడు ఉండే బీజేపీ నాయకులతో పాటు బళ్లారి బ్రదర్స్ కీలకంగా పనిచేశారు. అప్పట్లో మైనింగ్ బూమ్ నడుస్తోంది. చేతినిండా డబ్బులు ఆడుతున్న సమయంలో కర్ణాటకలో గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు, చెప్పిందే వేదం అనే రీతిలో సాగింది. అప్పట్లో ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రులనే వీరు మార్చగలరు అనే విధంగా వీరి హవా కొనసాగింది. 2008లో బళ్లారి జిల్లాతో పాటు రాయచూరు, చిత్రదుర్గం, కొప్పళ యాదగిరి లాంటి జిల్లాల్లో కూడా వీరు రాజకీయాలను శాసించారు. బీజేపీ హయాంలో ముఖ్యమంత్రి యడ్యూరప్ప బళ్లారి జిల్లా నుంచి ఏకంగా ముగ్గురు మంత్రులను నియమించారు. గాలి జనార్దన్‌రెడ్డి పర్యాటక శాఖ మంత్రిగానూ, గాలి కరుణాకర్‌రెడ్డి రెవెన్యూ మంత్రిగాను శ్రీరాములు కార్మిక శాఖ, ఎస్సీ సంక్షేమశాఖ మంత్రిగాను అధికారం చలాయించారు. గాలి సోమశేఖర్‌రెడ్డి కేఎంఎఫ్ అధ్యక్షుడుగానూ పక్కీరప్ప రాయచూరు ఎంపీగాను, సురేష్‌బాబు కంప్లి ఎమ్మెల్యేగాను పనిచేశారు.

2011లో ఏపీ సీఎం రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వైసీపీని జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పితే.. కర్ణాటకలో గాలి జనార్దన్‌రెడ్డి, జే శ్రీరాములు కలిసి బిఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేరుతో కొత్త పార్టీని స్థాపించారు. కానీ కొద్ది నెలలకే శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి స్థాపించిన బిఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా పీకేశారు. ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బిఎస్ఆర్ పార్టీకి అప్పుడు శ్రీరాములు అధ్యక్షుడుగానూ, శాంత గౌరవసభ్యులుగానూ ఉండేవారు. అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దన్‌రెడ్డి జైలుకు పోవడంతో రాజకీయ పరిణామాలు మారిపోయాయి.



ఏపీ సీఎం జగన్ రెడ్డితో కలిసిన కర్ణాటక మాజీ ఎంపీలు జే.శ్రీరాములు, ఫకీరప్ప

తర్వాతికాలంలో తన వలన ఎదిగిన శ్రీరాములు తనను పట్టించుకోవడం లేదని గాలి జనార్దన్‌రెడ్డి మథనపడ్డారు. అయితే తన మంది మార్బలం లేకుండా ఆయన ఎలా ఎదుగతారని శ్రీరాములు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం గాలి జనార్దన్‌రెడ్డికి, మాజీ ఎంపీ శ్రీరాములు మధ్య దూరం పెరిగిందని ఆయన వర్గీయులు అంటున్నారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ బళ్లారి జిల్లాలో ఘోరంగా ఓడిపోయింది. ఎస్టీ సామాజిక వర్గం బలంగా ఉండే ప్రాంతంలో శ్రీరాములు, ఆయన బంధువులందరూ ఓడిపోయారు. అదే సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి.నాగేంద్ర, ఆయన మద్దతుదారులు విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో శ్రీరాములు 28 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కర్ణాటకలో ఓడిపోయిన శ్రీరాములు.. ఏపీ వైపు

ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం శ్రీరాములు ఏపీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డితో కలిసి సమావేశం అయ్యారు. ఆసమావేశంలో మాజీ ఎంపీ ఫక్కీరప్ప కూడా ఉన్నారు. జగన్‌ను కలిసిన తరువాత రాజకీయంగా శ్రీరాములు సోదరి శాంతను ఏపీ నుండి ఎంపీగా పోటీకి దింపారు. ఇది ఎంత వరకూ సఫలం అవుతుందో తెలియదు. సొంత స్థానంలోనే గెలవలేని శ్రీరాములు ఇతర రాష్ట్రాలకు వెళ్లి గెలుస్తారా? అసలు అక్కడ ఉండే స్థానిక వాల్మీకులు వీరిని ఆదరిస్తారా.? అనే విషయమై చర్చ సాగుతోంది. వాస్తవానికి స్థానికంగా బలం లేకనే ఇంత కాలం శ్రీరాములు అనేక నియోజకవర్గాలు చుట్టూతిరిగి పోటీ చేస్తూవచ్చారు. వారి నిజస్వరూపం తెలిసిన వాళ్లు ఎవరూ ఆయనను దగ్గరకు చేర్చుకోలేదని కూడా తెలుస్తోంది.

ఇప్పటికే హిందూపురం నియోజక వర్గంలో ఉండే స్థానిక వాల్మీకులు జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల మండి పడుతున్నారు. ఇంత మంది స్థానికంగా ఉండే వాల్మీకులను కాదని శాంతమ్మను ఎంపీ పోటీలో నిలపడం ఏమిటని స్థానిక వాల్మీకులు అసంతృప్తితో ఉన్నారు. ఇదిఇలా ఉంటే శ్రీరాములు సోదరి శాంతను ఏపీ రాజకీయాల్లో నిలిపి తాను కర్ణాటక రాజకీయాలు చేస్తే ఏం బాగుంటుందనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదీ కాకుండా ఎక్కువగా శ్రీరాములు వర్గం బెంగళూరులో భూ సెటిల్ మెంట్లు, పంచాయితీలు చేస్తుంటుంది. ఇక తన సోదరి హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గం ఎంపీగా పోటీ చేస్తే గెలిచినా, ఓడినా అక్కడపట్టు ఉంటుంది కాబట్టి భూ పంచాయితీలు రియల్ దందాలు చేసుకోవచ్చుననే రీతిలో ఆలోచించి ఆయన ఏపీ రాజకీయాల్లో వచ్చారని స్థానికులు అంటున్నారు. రాజకీయంగా గాలిజనార్దన్‌రెడ్డి జగన్‌కు దూరం కావడం కూడా ఇందుకు మరో కారణమంటున్నారు. ఏది ఏమైనా శ్రీరాములు ఏపీ రాజకీయాల్లోకి వెళ్లడంతో కర్ణాటక ప్రజలు కూడా ఆయన్ను నమ్మలేని పరిస్థితి నెలకొంది.

వేడుకగా సావిత్రీబాయి పూలే జయంతి



సావిత్రీబాయి పూలేకి నివాళులర్పిస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, కంప్లి, జనవరి 3: స్త్రీవిద్యకై మొదటిసారిగా పాఠశాలను ప్రారంభించిన కీర్తి సావిత్రీబాయి పూలేకు దక్కుతుందని కర్ణాటకరాష్ట్ర క్రియాశీల ఉపాధ్యాయుల వేదిక బళ్లారిజిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి. తెలిపారు. తాలూకాలోని సంజీవరయానకోట ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సావిత్రీబాయి పూలే 193వ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. బాలికలు ఉన్నత చదువులు చదివి తమ కాళ్లపై తాము నిలవాలని ఆకాంక్షించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన దినేశ్, కురుబర హరీశ్, యువరాజు తదితర విద్యార్థులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో దిల్షాద్ బేగం, మోదీన్‌సాబ్, చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేతా, ఉమ్మేహానీ,శశమ్మ, రామాంజినేయులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్లిలో..

సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కంప్లి, కురుగోడు, కుడితిని, దరోజీ వివిధ గ్రామాలలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కొత్త దరోజీ గ్రామంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీకాంత్ పూజారిని విడుదల చేయాలి



రాయల్ సర్కిల్‌లో బీజేపీ నాయకుల నిరసన

బళ్లారిరూరల్, జనవరి 3 :హుబ్లీకి చెందిన శ్రీకాంత్ పూజారిని విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా శ్రీరామ భక్తులపై పోలీసు శాఖ చేస్తున్న దౌర్జన్యాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ బళ్లారి నగరంలో బుధవారం బీజేపీ కార్యకర్తలు గడిగే చెన్నప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. శ్రీకాంత్ అయోధ్య రామాలయం గురించి దేశానికి చాటిచెప్పారని అలాంటి పూజారిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ నేతలను కాంగ్రెస్ పార్టీ అనవసరంగా అరెస్టు చేస్తోందని బళ్లారి బీజేపీ జిల్లా అధ్యక్షులు మురహరి గౌడ ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోతూరు శ్రీనివాస్, మల్లన్నగౌడ, సిద్దేష్, శ్రీనివాస్, తిప్పన్నతోపాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జనవరి 3: ఎమ్మెల్యే బీఎం నాగరాజు చేతుల మీదుగా 28, 29 వార్డులలో వెయ్యిమందికిపైగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సిరుగుప్ప పట్టణం సింధనూరు రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిన్నా కృష్ణ, కొడ్లి ధర్మరాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా 28, 29 వార్డుల కాంగ్రెస్ నాయకులు వీరప్ప, కౌన్సిలర్లు గణేష్, మోహిద్దీన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విహారంలో సిబ్బంది.. సమస్యల్లో ప్రజలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 3: బళ్లారి తాలూకా పరిధిలోని కారేకల్లు గ్రామ పంచాయతీ పంచాయితీ అభివృద్ధి అధికారి(పిడిఓ), సిబ్బంది, అధ్యక్షులు విహార యాత్రలకు వెళ్ళడంతో గత మూడు నాలుగు రోజులుగా కారేకల్లు గ్రామ పంచాయతీలో పనులు స్తంభించి పోయాయి. దీంతో గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే కారేకల్లు నాగేనహళ్ళి, బ్యాలచింత, డి.నాగేనహళ్ళి డి.నాగేనహళ్ళి, తంబ్రహళ్ళి ఆరు గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే కారేకల్లు గ్రామ పంచాయతీ తాలూకాలో విసిరేసినట్లు ఆంధ్రరాష్ట్రం సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో తాలూకా స్థాయి అధికారులు ఈ గ్రామ పంచాయతీ వైపు చూడడం, అంతంత మాత్రమేనని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా గ్రామ పంచాయతీలో అధ్యక్షులు మొదలుకుని గ్రామ పంచాయతీ పిడిఓ, బిల్‌కల్టెర్, వాచ్‌మెన్‌తో పాటు అందరూ కట్టకట్టుకుని విహారయాత్రకు వెళ్ళడంతో ఆరు గ్రామ పంచాయతీలకు చెందిన సమస్యలను పట్టించుకునే నాధుడేలేకుండా పోయారు. దీంతో గ్రామ పంచాయితీలో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డులు మొదలుకుని కుల, ఆదాయ పత్రాలు, భూములకు సంబంధించి పహణీలు తదితర 25కి పైగా సేవలు నిలిచిపోయాయి.



1వ తేదీ నుంచి కారేకల్లు పంచాయతీ భవనానికి వేలాడుతున్న తాళం

మూడు నాలుగు రోజులుగా కారేకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఆరు గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు ప్రభుత్వ సేవల కోసం వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కారేకల్లు గ్రామంలో ప్రజలకు శుద్దనీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్(శుద్ద నీటి) పనిచేయక పోవడంతో కారేకల్లు గ్రామ ప్రజలు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా పంచాయతీ అభివృద్ధి అధికారి సెలవుపై వెళ్ళాలంటే బళ్ళారి తాలూకా పంచాయితీ కార్యానిర్వహణ అధికారి(ఇఓ) అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎవరైనా సెలవుపై వెళ్ళాలంటే పిడిఓ అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే కారేకల్లు పిడిఓ ఎలాంటి సెలవు తీసుకోకుండా, మరొకరికి బాధ్యతలు అప్పగించకుండా వెళ్ళడం వెనుక తాలూకా పంచాయతీ ఇఓ ఆశీర్వాదం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై బళ్ళారి తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారిని వివరణ కోరగా.. ప్రభుత్వ సెలవు రోజుల్లో విహార యాత్రకు వెళ్ళినట్లు సమాధానం చెబుతూ... వాట్సప్‌లో మెసేజ్ చేశారు. డిసెంబరు 31 ఆదివారం మినహా, నూతన సంవత్సరం జనవరి 6వ తేదీ వరకు మధ్యలో ఎలాంటి ప్రభుత్వ సెలవులు లేవు. కాని కారేకల్లు పిడిఓ సిబ్బంది ఎలా యాత్రలకు వెళ్ళారో తెలియజేయాలని కారేకల్లు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్యాన్సర్‌పై జాగృతి

తోరణగల్లు, జనవరి 3 : తాలుకా పరిధిలోని కురేకుప్ప పురసభ పరిధిలోని తోరణగల్లు స్టేషన్ 17వ వార్డులో పిల్లలు, మహిళల ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బ్రెస్ట్, గర్భకోశ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాలుకా శిక్షణ అధికారి శివు మాట్లాడుతూ మహిళలు విషయాలలో చాలా జాగ్రత్తగా వుండాలని అలాగే గుప్త జననాంగాలతో కనిపించే గడ్డలను తెల్లబట్టను ఎప్పటికప్పుడు గమనిస్తూ అలాంటి సూచనలు కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. అసహజ రుతుస్రావం, వక్షోజాలలో గడ్డలు కనిపిస్తే వెంటనే డాక్టర్ సంప్రదించి తగిన జాగ్రత్త తీసుకుని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ యోజన కార్డును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఈ సందర్భంగా ఆరోగ్య సురక్షణాధికారి భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు భారీగా పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేకూరే వరకు పోరాటం

కంప్లి, జనవరి 3 : కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్న కుడితిని పరిధిలోని హరిగిణదోణి, జానెకుంటి, కొళగల్లు, సిద్దమ్మనహళ్లి, కుడితిని గ్రామాలకు చెందిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు సంచాలకులు తిప్పేస్వామి, కరవే పదాధికారి జంగ్లిసాబ్ తెలిపారు. 380 రోజులకు పైగా రైతుల పోరాటం జరుగుతోందని, అయినా ఇంతవరకు ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ స్పందించలే దన్నారు. గతంలో ధర్నా చేసే సమయంలో బీజేపీ, జేడీఎస్, క్షేత్ర ఎమ్మెల్యే గెలిచిన వెంటనే కర్మాగారాలకు భూములు పోగొట్టుకున్న రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, గెలిచిన అనంతరం నిరసన కార్యక్రమం వైపు కూడా చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మభ్యపెట్టేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి త్వరలోనే తమకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. బెల్గామ్‌లో సీయం నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేశారని, ఆ సందర్భంగా త్వరలోనే తమకు న్యాయం జరిగేలా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. తమకు న్యాయం లభించకపోతే త్వరలోనే భారీ ఎత్తున జిల్లా స్థాయిలో నిరసనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు భారీగా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

బలమైన బళ్లారి కోసం చేతులు కలపండి

● మాదకద్రవ్యాలపై మారథాన్‌లో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



మారథాన్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజలు

బళ్లారి సిటీ, జనవరి 03: స్వచ్ఛమైన బళ్లారిని, బలమైన బళ్లారిలా మార్చేందుకు యువత చేతులు కలపాల్సిన అవసరం ఉందని బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణావల్ల కలిగే దుష్పరిణామాలపై డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానంలో బుధవారం మారథాన్ రేసు ముగింపు కార్యక్రమం జరిగింది. జిల్లాపరిపాలన, జిల్లాపోలీస్, జీపీఏ, ఎంఎస్‌పీఎల్ బల్డోటా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలన్నారు. ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా జాగ్రత్తపడాలన్నారు. జిల్లాపోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం మారథాన్ పరుగును ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లోకేశ్ కుమార్ ప్రారంభించారు. ఇందులో 1300 నుంచి 1400 మంది యువకులు, అసోసియేషన్ అధికారులు, కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. మారథాన్‌లో గెలుపొందిన వారికి బహుమాతులు అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపంచాయితీ కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్‌కుమార్, డిప్యూటీ కన్జవేటర్ ఆఫ్ ఫారెస్టు సందీప్ సూర్యవంశీ, ప్రొఫెసర్ రుద్రేశ్, అదనపు సూపరింటెండెంట్ రవికుమార్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫారమ్-2 నమోదు ప్రక్రియ ప్రారంభం



ఫారమ్-2 ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి రూరల్, జనవరి 3: నగరంలోని మిల్లర్‌పేట, గణపతి దేవస్థానం, వాటర్ ట్యాంకు సమీపంలోని 13వ వార్డులో ఫారమ్ 2 గురించి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పట్టాలు తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారమ్-2 ఆన్‌లైన్ చేయడంతోపాటు ప్రజా సమస్యలను ఆయన తెలుసుకున్నారు. మూడు రోజుల పాటు ఈ కేంద్రంలో నిర్వహించే ఫారమ్2 ప్రక్రియను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వారి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాజుల శ్రీనివాస్, జబ్బార్, బీఆర్ఎల్ శీన, శివు, రాకేష్, వుండేకర్ ప్రదీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పశువుల ఫారాన్ని పరిశీలించిన కలెక్టర్



మత్తిగిరి పశుసంవర్ధక ఫారంలో కలెక్టర్ సరయు

హోసూరు (మత్తిగిరి) జనవరి 3: హోసూరు సమీపాన మత్తిగిరి పశుసంవర్ధక ఫాంలో టెక్నాలజీ యూనిట్, టెస్ట్ ట్యూబ్ ఇన్‌సెమినేషన్ లేబరేటరీను కలెక్టర్ సరయు బుధవారం స్వయంగా పరిశీలించారు. మైసూరు చక్రవర్తి టిప్పుసుల్తాన్ కాలంలో చక్కటి గుర్రాలను ఉత్పత్తి చేసేందుకు ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. టిప్పుసుల్తాన్ నుంచి 1824లో బ్రిటీష్ వారు సైనిక గుర్రాల పెంపకం కోసం దీనిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత 1924లో బ్రీడింగ్ పేరుతో మద్రాసు ప్రావిన్షియల్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. 1939లో పశువుల రీసెర్చ్ ప్రారంభమయింది. ఇక్కడ సింధి, కంగేమ్ జాతుల పెంపకం, అభివృద్ధిపై పరిశోధనలు జరిగాయి. 1970లో దీనిని జిల్లా పశువుల పారం, తమిళనాడు ప్రభుత్వ పశుసంవర్ధక శాఖకు అనుబంధంగా చేర్చారు. ఇందులో ఇంక్యుబేషన్, ఎంబ్రియో టెక్నాలజీ విభాగం, డెయిరీ డివిజన్, గ్రాస్‌ల్యాండ్ డివిజన్, ప్లాంటేషన్ డివిజన్‌లు ఉన్నాయి. హైబ్రీడ్ జెర్సీ, రెడ్ సింధీ, కాంగేయం, పుక్కులం, సాహీవాల్ జాతుల ఘనీభవించిన వీర్యం ఇక్కడ ఉత్పత్తి అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న వెటర్నరీ క్లినిక్‌లకు ఈ వీర్యాన్ని పంపిణీ చేస్తున్నారు. సంవత్సరంలో 9,12,922 ఘనీభవించిన వీర్యనాళికలు ఇక్కడ ఉత్పత్తి అవుతున్నాయి. 2012లో రూ.3 కోట్ల ప్రాజెక్టుగా ఎంబ్రియో టెక్నాలజీ విభాగం ప్రారంభమయింది. 12 జిల్లాలకు (సేలం, నామక్కల్, కృష్ణగిరి, ధర్మపురి, మదురై, తేని, కోయంబత్తూరు, తిరుపూర్, వేలూరు, తిరువణ్ణామలై, ఈరోడ్, కరూర్) తగిన జెర్సీ ఆవులను ఎంపిక చేసి పిండాలను అమర్చుతున్నారు. కలెక్టర్ వెంట జోనల్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రన్, డిప్యూటీ డైరెక్టర్ భారతీ తదితరులు పాల్గొన్నారు.

తొరపల్లిలో విశేషంగా ధనుర్మాస పూజలు

హోసూరు, జనవరి 3: తొరపల్లి అగ్రహారలో ఏటా ధనుర్మాసాన్ని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహిస్తారు. పూజలు డిసెంబరు 16న ప్రారంభం కాగా జనవరి 14వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా వేకువజామున 3 గంటలకు శివాలయం వద్ద ప్రారంభించి 6.30 గంటల వరకు తొరపల్లి గ్రామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో స్వామిని గోమాతతో సహా ఊరేగిస్తూ అమోఘమైన భజన చేస్తారు. ప్రతి ఇంటినుంచి భక్తులు పాల్గొనడం విశేషం. అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అన్నదానం నిర్వహిస్తున్నారు.



గోమాతను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

10న బీజేపీ పాదయాత్ర

హోసూరు (సిఫ్‌కాట్) జనవరి 3: హోసూరు తళి ఏరియాలో 10వ తేదీన 'నా మట్టి నా ప్రజలు' అనే అంశంపై పాదయాత్ర ఉంటుందని బీజేపీ నేత రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. తళి నియోజకవర్గ పరిధిలో భైరమంగలం పంచాయతీ అగ్గొండపల్లిలో బుధవారం బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకి శ్రీనివాసరెడ్డి, సతీష్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. వంద మందికి 'నా మట్టి నా ప్రజలు' అనే టీ షర్టులను అందజేశారు. అలాగే కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందినవారు, పంచాయతీ మాజీ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ ప్రముఖులు శేఖర్, రాజప్ప, అనుమంతప్ప, సురేశ్‌రెడ్డి, మలికార్జున, ఆనందరెడ్డి, విశ్వనాథరెడ్డి, బాలు, సంతోష్, హరిప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ దేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రాయచూరు జనవరి 3 : తాలూకాలోని మర్చటాళ్ గ్రామ పంచాయతీ పరిధిలోని దిన్ని గ్రామంలో వెలసిన మారెమ్మదేవి ఆలయాన్ని బుధవారం రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, జాతర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో జాతర, బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు ఎమ్మెల్యేకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

శ్రీకాంత్ పూజారి నిర్బంధం కుట్రపూరితం

రాయచూరు జనవరి 3 : రామ జన్మ భూమి వివాదానికి సంబంధించి పాత కేసును తిరగదోడి రామ భక్తుడైన శ్రీకాంత్ పూజారిని పోలీసులు అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ అన్నారు. శ్రీకాంత్ పూజారి అరెస్టుకు నిరసనగా బుధవారం బీజేపీ నాయకులు నగరంలోని డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న సిటీ ఎమ్మెల్యే ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోవడం ఖాయమన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి అరెస్టులు చేయించడం ద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనన్నారు. ఈనెల 22న శ్రీరామ మందిరం ప్రత్యేక పూజలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రామ భక్తులను అరెస్టు చేయాలని తలపోయడం హిందు వ్యతిరేక ధోరణి కాక మరేమిటని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ శ్రీకాంత్ పూజారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఏడీసీ దుర్గేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంయ్...

సర్ ఐజాక్ న్యూటన్ (జయంతి)



'సర్' ఐజాక్ న్యూటన్ 1643 జనవరి 4న (పాత క్యాలెండర్ ప్రకారం) యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. గురుత్వాకర్షణ సిద్ధాంతం ద్వారా సైన్స్ పితామహగా పేరొందారు. సైన్స్ దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి, ఆధునిక ఇంజనీరింగ్‌కు ఆయన రాసిన గ్రంథమే పునాది. కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. లండన్‌లోని రాయల్ సొసైటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1727 మార్చి 31న కన్నుమూశారు. మరణానంతరం ఆయన రాసిన పలు రచనలు ప్రచురితమయ్యాయి.

ఆర్‌డీ బర్మన్ (వర్ధంతి)



రాహుల్‌దేవ్ (ఆర్‌డీ) బర్మన్ 1939 జూన్ 27న కోల్కత్తాలో జన్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు సచిన్‌దేవ్ బర్మన్ కుమారుడు. తండ్రి బాటలోనే సంగీతంలో రాణించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 1960-90ల మధ్య 331 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. పాశ్చాత్య, లాటిన్, ఓరియెంటల్, అరబిక్ శైలి సంగీతం శైతం అందించారు. భార్య ఆశాభోస్లేతో పాటు కిశోర్‌కుమార్, లతా మంగేష్కర్ వంటి గాయకులతో పాటలు పాడించారు. హిందీ సినీరంగంలో తనదైన ముద్రను చాటారు. 3 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 1994 జనవరి 4న కన్నుమూశారు.

భార్య కాపురానికి రాలేదని

యువకుడి ఆత్మహత్య

పావగడ, జనవరి 3: భార్య కాపురానికి రాలేదని జీవితంపై విరక్తి చెంది చంద్రశేఖర(27) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాంజనప్ప, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాలూకాలోని దొమ్మతిమర్రి గ్రామ పంచాయతీ బోదరహళ్లి రామాంజనప్ప కుమారుడు చంద్రశేఖర్. ఇదే తాలూకాలోని గుమ్మగట్ట గ్రామానికి చెందిన షర్మిల అనే యువతితో నాలుగేళ్ల క్రితం వివా హమైంది. వీరికి సంవత్సరం కుమారుడు ఉన్నాడు. షర్మిల వారానికి రెండు మూడు సార్లు ఎవ్వరికీ చెప్పకుండా తన పుట్టినిల్లు అయిన గుమ్మగట్టకు వెళ్లేది. అక్కడి నుంచి షర్మిల అక్క రామాంజనమ్మ గ్రామమైన ఆంధ్రాలోని శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న సోమందేపల్లి మండలం క్యాతగానచెర్లకు కూడా వెళ్లేది. ఈ క్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా తన కుమా రుడికి కొత్త బట్టలు తీసుకొని భర్తతో కలిసి సోమవారం గుమ్మగట్టకు వెళ్లింది. అయితే అక్కడ భర్తతో గొడవపడింది. తాను కాపురానికివచ్చేది లేదని నీకుమారుడిని కావాలంటే తీసుకెళ్లు... నీకు విడాకులు ఇస్తానని ఆమె గొడవ పడినట్లు చంద్రశేఖర్ తండ్రికి తెలిపాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి తన స్వగ్రామానికి వచ్చిన చంద్రశేఖర్ మంగళవారం అంతా బాధపడ్డాడు. రాత్రి 11 గంటల సమయంలో తమ ఇంట్లోనే భార్య చీరతోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తండ్రా రామాంజనప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే తన కుమారుడి చావుకు కోడలు షర్మిల, ఆమె అక్క రామాంజనమ్మే కారణమని, వారిద్దరిపై కేసు నమోదు చేయాలని ఆయన ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని, ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురునాథ్ తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వండి

పుట్టపర్తి, జనవరి 3: జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ఏర్పాటుపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, బాత్‌రూమ్‌లు, ర్యాంపులు, సౌకర్యాలపై రెండ్రోజుల్లోగా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్ అధికారుల నియామకానికి సంబంధిత శాఖల్లో అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు ఫిర్యాదులపై బీఎల్ఓలతో తహసీల్దార్లు సమావేశమై, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ భరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, సురేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సహాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు మెమో

మడకశిరటౌన్, జనవరి 3: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలకు సంబంధించి పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు సమావేశానికి హాజరుకాకుండా మేనేజర్‌ను పంపడంతో సబ్ కలెక్టర్ మెమో జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరిగే సమావేశాలకు అధికారులు హాజరుకావాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎన్నికల ఫారం-6 ఫారం-7 ఫారం-8 తదితర వాటిపై చర్చించారు. ఓటరు వెరిఫికేషన్‌పై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తాన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీప్రసాద్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

లేపాక్షి, జనవరి 3 : మండలంలోని కంచిసముద్రం గ్రామంలో వెలసిన గోందావళి సద్గురు బ్రహ్మచైతన్య స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, గోపూజ, సహస్రనామపూజ, నవగ్రహజపం, సూర్య ప్రార్థన, అఖండ రామభజన, సుందరకాండ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు దీపోత్సవం

స్వామివారి ఆలయంలో గురువారం దీపోత్సవం, 5న శుక్రవారం స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.


ఘనంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ

పెనుకొండ, జనవరి 3 : స్థానిక నగరేశ్వరస్వామి దేవా లయంలో బుధవారం మా నసదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ప్రాతఃకాలపూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం అన్నసం తర్పణ చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

పరీక్షల భయం పోగొట్టేందుకు

డిగ్రీలో ఓపెన్ బుక్ ఎగ్జామ్

» రాష్ట్ర ప్రభుత్వానికి ప్రొఫెసర్ జయకర కమిటీ సలహా



బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో పరీక్షల భయం పోగొట్టేందుకు డిగ్రీ స్థాయిలో ఓపెన్ బుక్ పరీక్షలను నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రొఫెసర్ జయకర కమిటీ సలహా ఇచ్చింది. ఇటీవలి కాలంలో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న తరుణంలో జయకర కమిటీ పలు సలహాలను నివేదిక రూపంలో ఇచ్చింది. డిగ్రీ విద్యార్థులకు ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించడంతోపాటు మార్కులకు బదులుగా గ్రేడ్‌ల విధానం తీసుకురావాలని సూచించింది. ప్రైవేట్ యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేకించి ఇంజనీరింగ్, మెడికల్‌తోపాటు ఎంబీఏ వంటి వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. పరీక్షల నుంచి తప్పించుకునేందుకు కాపీలు కొట్టడం, లేదా సాంకేతిక విధానాలను వాడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ తరుణంలో నే రాష్ట్రప్రభుత్వం విద్యార్థులపై వృత్తి విద్యా కోర్సులలో భారం తగ్గించే దిశగా తీసుకోవాల్సిన చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయదలిచింది. ఉన్నత విద్యాశాఖ సదరు కమిటీని 2023 జూలైలో ఏర్పాటు చేసింది. బెంగళూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్ఎం జయకర్ అధ్యక్షతన మౌల్యమాపన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్, నిమ్హాన్స్ ప్రొఫెసర్ వీణా సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యాపరిషత్ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. ఆరు నెలలపాటు సుదీర్ఘంగా అధ్యయనం చేసిన కమిటీ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. డిగ్రీ, పీజీ పరీక్షల్లో ఓపెన్ బుక్ పరీక్షలను జరపాలనే అంశాన్ని ప్రధానంగా సిఫారసు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఓపెన్ బుక్ ఎగ్జామ్స్‌కు ప్రాధాన్యత ఉంది. విశ్వ విద్యాలయాల్లో మార్కులకు బదులుగా క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్‌కు బదులుగా గ్రేడ్‌ల తరహాలో ఫలితాలు ప్రకటించాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మార్కుల్లో వ్యత్యాసం కనిపించదు. గ్రేడ్‌లు ప్రకటించే విధానం విదేశాలలో అమలులో ఉంది. కర్ణాటకలోనూ ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సిఫారసు చేశారు.

ప్రతి సంస్థలోనూ కౌన్సెలింగ్ సెంటర్

విద్యార్థులు ఎదుర్కొనే ఎటువంటి సమస్యలైనా నేరుగా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి పరిష్కారం దిశగా పనిచేసేలా కౌన్సెలింగ్ సెంటర్‌లు ప్రతి విద్యాసంస్థలోనూ కీలకమని సిఫారసు చేశారు. ప్రతి యూనివర్సిటీ, విద్యాసంస్థలలో కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు కౌన్సిలర్‌లకు తెలిపే అవకాశం ఉంది. తద్వారా మానసిక న్యూనతా పరిష్కారం కానుంది. అకడమిక్ లేదా ఇతర సమస్యలైనా సెంటర్‌లో చెప్పుకోవడం ద్వారా కొంత ఉపశమనానికి కారణం కానుంది. తద్వారా విద్యార్థులలో ఆత్మబలం పెరగనుందని సూచించింది. చిన్నపాటి సమస్యలకు తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడేలాంటి పెద్దతప్పులు దాకా వెళ్లకుండా నియంత్రించే దిశగా కేంద్రాలు ఉంటాయని సూచించింది. విద్యాసంస్థలు విద్యార్థుల మానసిక, శారీరక, ఆరోగ్యంపట్ల కూడా ఆలోచించాలి. అకడమిక్‌లో బాల బాలికల మధ్య వ్యత్యాసం లేకుండా సమానమనే భావన కల్పించాలి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు మెంటార్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పద్ధతి అన్ని విద్యాసంస్థల్లోనూ అమలులోకి రావాలి. తద్వారా ఒక అధ్యాపకుడికి పది మంది విద్యార్థుల సమస్యలను సులభతరంగా తెలుసుకునేందుకు వీలు కల్పించినట్లు అవుతుందని సిఫారసు చేశారు.

ఓపెన్‌బుక్ పరీక్షలంటే...

ఓపెన్‌బుక్ పరీక్షల విధానం ఇప్పటికే విశ్వేశ్వరయ్య టెక్నికల్ విశ్వ విద్యాలయం(వీటీయూ)లో కొన్ని కోర్సులకు అమలు చేస్తున్నారు. విద్యార్థులకు హ్యాండ్ బుక్ లేదా అందుకు సంబంధించిన పుస్తకాలను పరీక్షలకు ఇస్తారు. పాఠ్య పుస్తకంలో నేరుగా కాకుండా మార్పులతో ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు వాటిని పుస్తకాల ద్వారా పరిశీలించుకుని పరీక్షా సమయంలో రాయొచ్చు. తద్వారా మాస్ కాపీయింగ్‌ను నియంత్రించవచ్చు.

చెత్త సమస్య పరిష్కారానికి కొత్త మార్గం

» నాలుగు వైపులా చెత్తసంస్కరణ కేంద్రాలతో విద్యుత్ తయారీ

» బెంగళూరు నగరాభివృద్ధి శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్



జనస్పందన కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, ఎమ్మెల్యేలు తదితరులు

మహదేవపుర, జనవరి 3: రాజధాని బెంగళూరు నగరంలో సమస్యాత్మకంగా ఉన్న చెత్త సమస్య పరిష్కారానికి సరికొత్త మార్గం సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. బుధవారం కేఆర్‌పుర, మహదేవపురలలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఇదే తొలిసారిగా 'ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవకు సహకారం' పేరిట ఏర్పాటైన కార్యక్రమంలో నియోజకవర్గాల జనస్పందన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ బెంగళూరు నగరవ్యాప్తంగా తలెత్తుతున్న వేలాది టన్నుల చెత్తను సంస్కరించేందుకు బెంగళూరు నగరం నాలుగువైపులా స్థాపించి వాటి ద్వారా చెత్తను సంస్కరించి విద్యుత్ తయారీ చేయడం, పర్యావరణానికి హానిలేని రీతిలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహదేవపుర ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, కేఆర్ పుర ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ నేతృత్వంలో ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. బెంగళూరు నగర పరిధిలోకి వచ్చే బీబీఎంపీ, బీడీఏ, బీఎంటీసీ, బీఎంఆర్‌డీఏ, జలమండలి, రెవెన్యూ, బెస్కాం తదితర అన్ని విభాగాలకు సంబంధించి ప్రజలు వినతులు అందచేశారు. మహదేవపుర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి మాట్లాడుతూ నగరంలో తలెత్తుతున్న చెత్తలో సుమారు 80శాతం మీటగానహళ్ళి క్వారీకి వస్తోందన్నారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. కొన్ని చోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచి రహదారులు దెబ్బతిన్నాయన్నారు. రాజకాలువలలో పూడికతీత పనులు సాగడం లేదన్నారు. నగరంలోని 80శాతానికి పైగా మురుగునీరు నియోజకవర్గంలో ప్రవహిస్తోందన్నారు. ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలు ఉన్నాయని ప్రధానంగా నీటి ఎద్దడి ఉందన్నారు. చుట్టుపక్కల 110 గ్రామాలకు నీరు సదుపాయం కల్పించాలన్నారు. పాత మద్రాస్ రోడ్డుకు అనుబంధంగా రూ.350 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మించాలన్న ప్రతిపాదన గత ప్రభుత్వంలో ప్రతిపాదన వచ్చిందని అయితే అనుకోకుండా ఆగిపోయిందన్నారు. దీన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని 11 వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు గ్రాంటు విడుదల చేయాలని, ఐటీఐలో ప్రజల ప్రవేశానికి విధించిన ఆంక్షలను తొలగించాలన్నారు. వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో సమస్య తలెత్తుతోందన్నారు. నియోజకవర్గంలో రాజకాలువ 60 కిలో మీటర్ల ఉందని, వర్షపునీరు సజావుగా వెళ్లేలా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. బెన్నిగానహళ్ళి మెట్రో రైల్వేస్టేషన్‌కు ఉదయనగర్ మెట్రో స్టేషన్‌గా పేరు మార్చాలని కోరారు. ఎమ్మెల్యేల వినతులపై డీసీఎం సానుకూలంగా స్పందించారు. ఏడాదిలోగా ఖాతాను ఇంటి చెంతకే ఉచితంగా అందేలా పథకం సిద్ధం చేస్తున్నామని, ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు మౌనిష్ మౌద్గల్, తుషార్ గిరినాథ్, రణదీప్, తహసీల్దార్ వై రవి, మహదేవపుర డివిజన్ జాయింట్ కమిషనర్ దాక్షాయిని, అన్వర్ మిర్జా, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భారీగా హాజరైన ప్రజలు

సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ మారుపేరు

» మంత్రి రామలింగారెడ్డి



ప్రారంభిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ మారుపేరు అని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం చందాపురలో రామ్‌రాజ్ షోరూంను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. వివేకానంద విద్యాసంస్థల ఎదురుగా ఏర్పాటు చేసిన షోరూంను మంత్రితోపాటు రామ్‌రాజ్ ప్రతినిధులు, భవన యజమాని సంతోష్‌కుమార్ సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు ఆలయాలకు పండుగల వేళ సాధారణ దుస్తులే ధరించేవారని రామ్‌రాజ్ బ్రాండ్‌తో సంప్రదాయమైన పంచె, చీరలతో దైవదర్శనాలకు వెళ్తున్నారన్నారు. కెప్టెన్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ బెంగళూరులో ప్రాంతాల వారీగా రామ్‌రాజ్‌శాఖలు ఉన్నాయని, ఎలక్ట్రానిక్‌సిటీ, చందాపుర, ఆనేకల్ అత్తిబెలె ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా రామ్‌రాజ్ ఏర్పడిం దన్నారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమిళ నాడులో ఆరంభించిన రామ్‌రాజ్ దక్షిణభారత్‌లోనే కాకుండా దేశమంతటా చిన్నపట్టణాల్లోనూ శాఖలు ఉన్నాయన్నారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాలలోనూ రామ్‌రాజ్ బ్రాండ్ దుస్తులు లభిస్తాయన్నారు. కాటన్ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రసిద్ధి అన్నారు. సంప్రదాయమైన దుస్తుల్లోనే ఆధునికశైలి అనిపించేలా డిజైన్లు చేశామన్నారు. ఏటా 25శాతం మార్కెటింగ్ పెరుగుతోందని అందుకు బ్రాండ్ నాణ్యతే కీలకమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త లక్ష్యంతో ముందుకు సాగండి

శిడ్లఘట్ట, జనవరి 3: నూతన సంవత్సరం తరుణంలో కొత్త పరికల్పన లక్ష్యంతో ముందుకు సాగాలని సమాజ సేవకుడు పుట్టు ఆంజినప్ప పిలుపునిచ్చారు. తాలూకాలోని జంగమకోటె హోబళి తొట్టిబావి వద్ద ఉన్న ముత్యాలమ్మ దేవాలయ నూతన ఏడాది వార్షిక పూజా కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. భక్తులకు స్థానిక జంగమకోటె హోటల్ రామయ్య కుటుంబం ఆధ్వర్యంలో దోసెను పంపిణీ చేశారు. పద్మశ్రీ ఘంటసాల గాన కళాబృందం ఆధ్వర్యంలో భక్తి భావగీతాలు, పాత చిత్రాల పాటలను ఆలపించారు. ఈ సందర్భంగా కాంతార సినిమాలోని నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీనియర్ ప్రముఖులు గుడియప్ప, తాలూకా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజ్, గ్రామపంచాయతీ సభ్యుడు చంద్ర మోహన్, ప్రకాశ్, జంగమకోటె గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు గుండప్ప, మాజీ సభ్యుడు గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.



కాంతార సినిమా పాత్రధారి

30 నిమిషాలు...10 రాగి ముద్దలు స్వాహా

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండ్యలో రాగిముద్దలు ఆరగించే పోటీలలో 62ఏళ్ళ ఈరేగౌడ విజేతగా నిలిచారు, మండ్య జిల్లా వ్యాప్తంగా ఏటా రాగి ముద్దలు తినే పోటీలు సాగుతాయి. ఇలా శ్రీరంగపట్టణ తాలూకా సిరిధాన్యాల పండుగను పురస్కరించుకుని మంగళవారం పోటీలు జరిపారు. మైసూరు, మండ్య ప్రాంతాలలో రాగి ముద్ద ముఖ్యమైన ఆహారంగా ఉంటుంది. అందుకే రాగిముద్దల పోటీలు జరుపుతారు. రాగిముద్దకు నాటుకోడి పులుసు, గుడ్డు ఇచ్చారు. పోటీలలో సుమారు వందమంది దాకా పాల్గొనగా ఈరేగౌడ ఏకంగా 2.70 కేజీల బరువు కలిగిన పది ముద్దలను తినడంతో విజేతగా ప్రకటించారు. రెండో స్థానంలో 1.682 కేజీల ముద్దలను తిన్న మేరకు టీఎం హోసూరు నివాసి రవీంద్ర నిలిచారు. ప్రతి ముద్దను తూకం వేసి ఇవ్వడం ద్వారా అరగంటలో ఎక్కువ ఎవరు ఆహారంగా తిన్నారనేది నిర్ధారించారు.



రాగిముద్దల పోటీ విజేత ఈరేగౌడ

కన్నడ నామఫలకాలు తప్పనిసరి

బాగేపల్లి, జనవరి 3: తాలూకా వ్యాప్తంగా దుకాణాలు, సంఘ సంస్థలు, పాఠశాల, కళాశాలలు ఇతరత్రా కార్యాలయాలపై నామఫలకాలు కన్నడలోనే అమర్చాలని కరవే (స్వాభిమాన వర్గం) డిమాండ్ చేసింది. సంఘం సంఘం తాలూకా అధ్యక్షుడు బీటీ శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం పురసభ ముఖ్యాధికారి రుద్రమ్మ శరణయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కన్నడ భాష, నేల, జలాలను గౌరవించాలని, కన్నడ పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భాషా సాహితీవేత్త వలి, మోహన్ ఎస్ అగ్రహార జిల్లా అధ్యక్షులు, రామకృష్ణరెడ్డి, పాల్గొన్నారు.



పురసభ ముఖ్యాధికారికి వినతి పత్రం అందజేత

సీఎం సహాయ నిధికి రూ.3 కోట్ల విరాళం



సీఎంకు చెక్కును అందజేస్తున్న మంత్రులు

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి కర్ణాటక రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ రూ.3 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు చెక్కు మొత్తాన్ని విద్యుత్ శాఖా మంత్రి కేజే జార్జి, రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబైరెగౌడ బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అందజేశారు. ఇదే సందర్భంగా రైతుల పంప్‌సెట్లకు సౌర విద్యుత్‌ను వినియోగించే అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఇంధన శాఖ అదనపు ముఖ్యకార్యదర్శి గౌరవ్ గుప్తా తదితరులు హాజరయ్యారు. అంతకుముందు సీఎం గృహజ్యోతి పథకం ప్రగ తిని సమీక్షించారు. ఈ గ్యారంటీ పథకాన్ని అర్హులంతా పొందేలా చూడాలని అధికారులకు సూచించారు.

జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జనవరి 3: ఇంటింటికీ కొలాయిల ద్వారా నీటిని అందించే జలజీవన్ మిషన్ పథకం పట్ల దుష్ప్రచారం సరికాదని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయ పడ్డారు. తాలూకాలోని పరగోడు గ్రామంలో సుమారు రూ.90లక్షలు, దేవరెడ్డిపల్లిలో సుమారు 60లక్షలతో జలజీవన్ మిషన్ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధతాగునీటిని అందించి పథకం అమలుతో నీటి కష్టాలు తప్పనున్నాయన్నారు. కాగా ప్రజలలో జలజీవన్ మిషన్ పథకంపై అనుమానాలు ఉన్నాయని, మీటరు అమర్చి డబ్బులు వసూలు చేస్తారనే సందేహాలలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. కేంద్రప్రభుత్వ పథకం కావడంతో ఒక్కపైసా కూడా కట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజనీర్ మహేశ్, పరగోడు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నాగవేణి సదాశివరెడ్డి, పీడీఓ నాగరత్నమ్మ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయేంద్రతో సంచార జాతుల నేతల భేటీ



విజయేంద్రను సన్మానిస్తున్న నేతలు

బెంగళూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్రతో సంచార జాతులకు చెందిన పలువురు నేతలు బుధవారం బెంగళూరు డాలర్స్ కాలనీ నివాసంలో భేటీ అయ్యారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ఈ నెల 28న జరిగే అలెమారి కులాల సాహిత్య, సాంస్కృతికోత్సవానికి విచ్చేయాల్సిందిగా ఆహ్వానించారు. విజయేంద్రను కలిసిన వారిలో సంచార కులాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కే రవీంద్ర శెట్టి, అధ్యక్షుడు ఎం ప్రకాష్, కార్యాధ్యక్షుడు శంకర్ హెబ్బళ్ళి, రాష్ట్ర యువ విభాగం అధ్యక్షుడు సచిన్ దళవాయి, కార్యాధ్యక్షుడు కెహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి కే శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు బ్యాటరాయస్వామి

కొండ మార్గం ప్రారంభం



మీడియాతో గోపాలరెడ్డి

బంగారపేట, జనవరి 3: భక్తులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బ్యాటరాయస్వామి కొండ దేవాలయానికి వెళ్లే మార్గానికి సిద్ధమైన నాణ్యమైన రోడ్డును ఈనెల 5న ఎమ్మెల్యే ప్రారంభిస్తారని కాంగ్రెస్ నాయకుడు గోపాలరెడ్డి తెలిపారు. తాలూకాలోని డీకేహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే బ్యాటరాయస్వామి దేవస్థానం వద్ద మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుమారు 60 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మించారన్నారు. 8 మీటర్ల వెడల్పుతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మించారన్నారు. బ్యాటరాయస్వామి దేవాలయ జాతరకు వేలసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో అనుకూలం కోసం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈనెల 5న ఎమ్మెల్యే నారాయణస్వామి సమక్షంలో ఆలయ పాలకమండలికి రోడ్డును అప్పగించనున్నట్టు తెలిపారు. కాగా ఎమ్మెల్యే సొంత ఖర్చుతో విద్యుత్ స్తంభాలు, స్వాగత తోరణం చేపట్టారన్నారు. కార్యక్రమానికి గ్రామస్థులు, పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొంటారన్నారు.

బస్ షెల్టర్‌ను పట్టించుకోండి



టీ దుకాణంగా మారిన బస్ షెల్టర్

చేళూరు, జనవరి 3: తాలూకాలోని ఏనిగదలె గ్రామ కేంద్రంలో చింతామణి - చేళూరు మెయిన్‌రోడ్డు మార్గంలో గతంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌లో ఇటీవల టీ దుకాణం వెలసింది. దీంతో ఇది టీ హోటల్‌గా మారి ప్రయాణీకులకు అసౌకర్యంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బస్ షెల్టర్‌లోని టీ స్టాల్‌ను ఖాళీ చేయించి ప్రయాణీకులకు వీలుగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

శిడ్లఘట్ట, జనవరి 3: తాలూకాలోని హనుమంతపుర గ్రామంలో ప్రభుత్వ పీయూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఏడు రోజుల వార్షిక ముగింపు శిబిరాన్ని నిర్వహించారు. యాడీడీఎం మరిస్వామి ఎన్‌ఎస్‌ఎస్ శిబిరార్థులకు నాయకత్వ, నైతికత లక్షణాలను పెంపొందించేలా సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ జగదీశ్ తమ శాఖ ప్రయోజనాలను వివరించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ సీడీపీఓ నవతాజ్ శాఖ సౌలభ్యాలను వివరించారు. సాదలి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మునిరాజు, శిబిరం డైరెక్టర్ సీ వెంకట శివారెడ్డి, శిబిరం అధికారి సీ మునిరాజు, అధ్యాపకుడు శివారెడ్డి, వచన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పటేల్ నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి

బాగేపల్లి, జనవరి 3: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన సావిత్రిబాయి పూలే జయంతిని తాలూకాలోని పరగోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రధానోపాధ్యాయుడు సీ వెంకటరాయప్ప మాట్లాడుతూ దేశ సామాజిక, సమానత, దీన దళితుల, వెనుకబడినవర్గాల విద్యా అభివృద్ధికి తనను తాను అంకితం చేసుకుని సమాజ ఉద్ధరణకు పాటుపడ్డారన్నారు. ఆమె ఆదర్శజీవితం అందరికీ మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందరాజు, కే రమాదేవి, జీఎస్ సత్యనారాయణ, రేష్మా తదితరులు పాల్గొన్నారు.